# లవంగాలు

సదానందం ఆఫీసు నుంచి బరువు అడుగులతో ఇంటికి వొచ్చేసరికి అత్తగారు ఎదురయారు. సైకిల్ ఫ్రీ వీలు పాడయి పాతిక రూపాయలు రిపేర్ల ఖర్చు మీద పడిందన్న బాధతోపాటు మూడు నాలుగు కిలోమీటర్లు నడిచి రావడంతోనూ అతనికి చాలా అలసటగా ఉంది. జీవితంలో అన్ని కష్టాలూ ఒక్కసారే వొస్తాయని గట్టిగా నమ్మిన మనిషి అతను. అందుకే ఆ రోజు అనుకోకుండా వొచ్చిన నూట పదహారు రూపాయల డి.ఏ. ఎరియర్సు కూడా తనకి ఉపశమనం కలిగించలేదు. అందులో పాతిక రూపాయలు పోనేపోయాయి.

ఇంటికి రాగానే అత్తగారి ఆగమనం.

ఆవిడ చెడ్డది ఏమీ కాదు. నిజానికి ఆవిడ వొస్తే అతనికి అత్యంత ప్రియమైన చేగోడీలూ, కజ్జికాయలూ విధిగా తెస్తుంది. ఇక్కడ వొంట అంతా తనమీద వేసుకుని అప్పడాల పిండి తప్పకుండా తయారు చేస్తుంది. "పిల్లని పువ్వులాగ పెంచుకున్నాం బాబూ! నీ చేతుల్లో పెట్టేము!" అని ప్రతీ గంటకీ ఆవిడ ఒకసారి కళ్ళు తుడుచుకుని, రెండుసార్లు ముక్కు చీదడం అతనికి మహ కష్టంగా ఉండేది. కాని అదీ అలవాటై పోయింది. ఏమయినా అత్తగారు అత్తగారే కదా! ఈ మధ్య ఆవిడ "దాని కడుపు పండలేదు" అంటూ జనాంతికంగా అంటూ బాధపడిపోవడం ప్రారంభించింది. అది కూడా తాత్కాలికమే అని సదానందం సరిపెట్టుకోలేకపోయాడు. ఇరవై కిలోమీటర్ల నించి రావడం ఆ అత్తగారికి కష్టం కాదు గనక ఆవిడ వారం విడిచి వారం వొస్తూనే వుంటుంది. ఆవిడ ఈసారి నెలపైగా రానే లేదని సదానందం ఆమెని చూశాక గాని గ్రహించలేదు.

"రా నాయనా! నీకోసమే చూస్తున్నాం. అంత ఆలీసంగా వొచ్చేవేమీ? ఒంట్లో నలతగా వుండి ఆయన రాలేకపోయారు గానీ ఈసారి ఆయనా వొచ్చేస్తానన్నారు. ఉన్నదాన్ని ఉన్నపళంగా బయలుదేరి వొచ్చేశాను. అయ్యో అలాగ నిలబడిపోయావేం? లోపలికిరా! అమ్మాయ్! అతనొచ్చేడే! కాఫీ నేనిస్తానుగానీ. నువ్వు కాస్సేపు లేచి తిరగొద్దులే" అంటూ అతనికి లోపలికి వెళ్ళడానికి దారి ఇచ్చింది ఆవిడ.

పార్వతి అంటే సదానందానికి చాలా ప్రేమ. నిజానికి ఆమెని అతను పువ్వులాగే చూసుకుంటాడు. దుర్భర దారిద్ర్యంలో




పుట్టి పెరిగిన సదానందానికి పార్వతి ఒక లక్ష రూపాయల ఆస్తిలా కనిపిస్తుంది. ముట్టుకుంటే కందిపోతుందేమో నన్నట్టే పార్వతి అతని కళ్ళకి కనిపిస్తుంది.

కజ్జికాయలూ, లడ్డూలూ, చేగోడీలు కంచంలో వేసి అతని ముందు పెట్టింది అత్తగారు. పార్వతి కనిపిస్తే బాగుండునని అతనికి ఉంది. ఎందుకని రాలేదో! ఆమెకేమీ అవలేదుకదా! కాని అత్తగారి ముఖం వెలిగిపోతోంది.

"ఇన్నాళ్ళకి మా పూజలు ఫలించాయి బాబూ! దానికి మూడో నెల అని తెలియగానే ఇంక మా ఆనందం ఏమని చెప్పనూ! అదీ ఉత్తరం రాసింది కాదు. ఆడపిల్ల కదా! సిగ్గు పాపం.. అది డాక్టరు దగ్గరకి వెళ్లినప్పుడు మా కరణంగారి అల్లుడి బావమరిది కామేశం లేడూ ! అతను నీ ఆఫీసే కదా! అతని భార్యకూడా అక్కడే వుందిట. నిన్న వాళ్ల తోటికోడలు ఆరోపిల్ల బారసాలకి మా వూరు వొచ్చి చెప్పింది. ఇంక ఉండలేకపోయాను ..."

ఇంద్రగిరి చంద్రమతి

ఆవిడ ఏం చెప్తుందో అర్థమై సదానందానికి ముఖం తిరిగినట్టు అయింది. తింటోన్నది చేదుగా అనిపించింది. ఎలాగో తినడం పూర్తి చేశాడు. కంచంలో వేసినది వొదలడం మహాపాపం.

ఆరేళ్లకిందట అరవై రూపాయిలకోసం అతను వాసక్టమీ చేయించుకున్నాడు. చచ్చు జీతపు గుమాస్తాగిరీ కోసం డిగ్రీ వుండాలి. ఆ పరీక్ష ఫీజు తన దగ్గర లేదు. అన్నీ అప్పటికే అమ్మేసి ఇంక ఏమీ మిగల్లేదు. అమ్మ చావు బ్రతుకుల్లో వుంది. చివరి పరీక్ష కాగానే ఆవిడ సంతృప్తిగా వెళ్ళిపోయింది. ఆ తరవాత పార్వతితో పెళ్ళి. ఈ చిరు ఉద్యోగం....

"నేను గుడికి వెళ్ళి వొస్తాను.... ఏమీ తిన్నావే కాదు!- గంటలో వొస్తాను" అంటూ అత్తగారు వెళ్ళింది.

సదానందం పార్వతి దగ్గరకి వెళ్లాడు. ఆమె మంచం మీద పడుకుని చేతితో కళ్ళు కప్పుకుంది.

సదానందానికి చాలా ఆలోచనలు వొచ్చాయి. ఆలుచుకుని కొన్ని నిమిషాల తరవాత ఆమె చేతిని నెమ్మదిగా తొలగించాడు. పార్వతి చిరునవ్వు నవ్వింది.

"అబ్బాయి కావాలా, అమ్మాయా?" అంది మారిపోయిన గొంతుకతో.

"ఎవరైనాసరే- ఒక్కరు చాలు. ఏం? అలాగేనా?" అన్నాడు సదానందం.

"అలాగే" అంది పార్వతి కళ్ళు మూసుకుని.

"థేంక్స్" అన్నాడు సదానందం తేలిక పడి. "చీర కొనుక్కో" అంటూ నూట పదహార్లు ఆమె చేతిలో పెట్టేడు. "నిజంగానే ఒక్కరు చాలు—ఏం?" అన్నాడు ఒట్టుకోసం చెయ్యిజాపుతూ.

ఆ చెయ్యి పట్టుకుని లేచి కూర్చుంటూ, "మనలో మనకి ఒట్లు ఏమిటండీ!— ఏ రంగు చీర కొనమంటారు?" అంది పార్వతి.

సదానందం మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. ●

